ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కర్ణాటక వార్తలు
శనివారం 20 సెప్టెంబరు 2025



జీఎస్టీ 2.0తో పన్ను వ్యవస్థ **సులభతరం**
● తగ్గనున్న నిత్యావసర వస్తువుల ధరలు 8


ఆటో డ్రైవర్ల **ఆందోళన**
● బైక్ ట్యాక్సీలకు అనుమతి ఇవ్వరాదని డిమాండ్



ముగ్గురు శిశువులతో డాక్టర్ న్యాన్సీ

ఒకే కాన్పులో
ముగ్గురు శిశువులు

బళ్ళారి గాంధీనగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హాసన్ జిల్లా హొళెనరసీపుర తాలూకా దొడ్డకాడనూరు గ్రామానికి చెందిన ఓ మహిళ ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చారు. హిమ్స్ ఆసుపత్రిలో వైద్యులు ఆమెకు గురువారం సిజేరియన్ చేశారు. ఆమెకు ఒక మగ శిశువు, ఇద్దరు ఆడ శిశువులు జన్మించారని హిమ్స్ ఆసుపత్రి స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ న్యాన్సీ పాల్ తెలిపారు. మగ శిశువు 2.1 కిలోలు, ఆడ శిశువులు1.9 కిలోలు, 1.8 కిలోల బరువు ఉన్నారని ఆమె తెలిపారు. తల్లి, ముగ్గురు శిశువులు ఆరోగ్యంగా ఉన్నారని, ఎలాంటి సమస్యలు లేవని అన్నారు. సాధారణంగా తల్లి తన గర్భంలో 6 నుంచి 6.50 కిలోల బరువు మోయగలరని, కానీ ముగ్గురు శిశువులతో కలిపి ఆమె తన గర్భంలో 8 కిలోలకు పైగా బరువును మోశారన్నారు. అయినా ముగ్గురు శిశువులు, తల్లికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకపోవడం విశేషమని డాక్టర్ న్యాన్సీ అన్నారు.





ఉపాధ్యాయులు ఉక్కిరి బిక్కిరి..!

● ఓవైపు అర్ధవార్షిక పరీక్షలు ● ముంచుకొస్తున్న కులగణన ● 1.75 లక్షల మందికి విధుల కేటాయింపు
● ఎప్పుడైనా రాష్ట్రంలో 'ఎస్‌ఐఆర్' ప్రక్రియ ప్రారంభం ● చదువు కుంటు పడుతుందని తల్లిదండ్రుల ఆవేదన

'ఎస్‌ఐఆర్'కు సిద్ధమవుతున్న ఎన్నికల కమిషన్

దేశవ్యాప్తంగా స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్ - ఓటరు జాబితా సమగ్ర సవరణ) అమలు చేస్తున్నారు. ప్రస్తుతం బిహార్‌లో కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత రాష్ట్రంలోనే కొనసాగించాలని నిర్ణయించారు. ఎస్‌ఐఆర్ ప్రకారం ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితా పూర్తిగా రద్దు కానుంది. ప్రతి ఓటరు కొత్తగా పేర్లతోపాటు సమగ్ర వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 1987కు ముందు జన్మించినవారికి ఎటువంటి అభ్యంతరాలు లేకున్నా ఆ తర్వాత జన్మించినవారికి సమగ్రమైన రికార్డులు సేకరిస్తారు. ఇది భారత పౌరసత్వంను నిర్ధారించే ఓ ప్రక్రియ లాంటిది. 1987 తర్వాత జన్మించి ఓటరుగా చేరినవారు, వారి పూర్వీకులకు సంబంధించిన రికార్డులు కూడా సమర్పించాల్సి ఉంటుంది. తద్వారా తప్పుడు ఓట్లను తేల్చేందుకే ఎస్‌ఐఆర్ ప్రక్రియను అమలు చేస్తున్నారు. బూత్ లెవెల్ అధికారుల ద్వారా ఎస్‌ఐఆర్‌ను అమలు చేసేందుకు ప్రక్రియ సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రాథమికంగా తాలూకా, జిల్లా స్థాయి శిక్షణలు ఈనెల 26వ తేదీతో సమగ్రంగా ముగుస్తాయి. రాష్ట్రంలో 58వేల పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. వీరిలో ఎక్కువమంది బూత్ లెవెల్ ఆఫీసర్స్ (బీఎల్‌ఓ)లుగా ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ ప్రక్రియ ఎప్పుడైనా ప్రారంభించే అవకాశం ఉంది. అందుకు ఎన్నికల కమిషన్ సర్వం సిద్ధమైంది. ఎస్‌ఐఆర్‌కు ఉపాధ్యాయులను తప్పనిసరిగా నియమించుకునే అవకాశం ఉంది. మరోవైపు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ)లో ఐదు పాలికెలను ఏర్పాటు చేశారు. వీటి ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం కసరత్తు జరుపుతోంది. ఏడాది ఆఖరులో గ్రామపంచాయతీ, అంతకు ముందుగానే తాలూకా, జిల్లా పంచాయతీ ఎన్నికలు జరపాల్సి ఉంది. అన్ని పనులూ ఉపాధ్యాయులకే కేటాయిస్తే విద్యా సంవత్సరానికి భంగం కలగనుందని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రాథమికంగా తప్పనిసరి విద్య అమలు చేస్తున్నామని చెప్పుకొనే ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధనలు కాకుండా ఇతరత్రా పనులు కేటాయించడం ద్వారా విద్యార్థులలో గుణాత్మకత తగ్గనుంది. ఇప్పటికే పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గిపోతున్నాయి. గత ఏడాది కంటే 5.22 లక్షల మంది విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఇప్పటికైనా ఉపాధ్యాయులకు అదనపుభారం తగ్గించాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తం అవుతోంది.

బెంగళూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయులు త్రిపాత్రాభినయం పోషించాల్సి వస్తోంది. సాధారణంగా అకడమిక్ తరగతులు జరిగే వేళ ఉపాధ్యాయులను ఇతర సర్వేలు, తదితర కార్యకలాపాలకు కేటాయించరు. తద్వారా విద్యావిధానానికి ఆటంకం కలుగుతుందని అధికారులు భావిస్తారు. గతంలో పలువురు విద్యానిపుణులు ప్రభుత్వానికి ఇదే అంశాన్ని పలుమార్లు సూచించారు. సాధారణంగా సార్వత్రిక ఎన్నికలు ఏప్రిల్, మే నెలల్లో నిర్వహిస్తారు. ప్రస్తుతం అర్ధవార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షల తర్వాత దసరా సెలవుల వేళ మౌల్యమాపనం జరుపుతారు. సెలవుల తర్వాత పాఠశాలలు తెరుచుకోగానే మార్కుల జాబితాను ప్రకటిస్తారు. ఏటా ఇదే విధానం కొనసాగుతుంది. కానీ ఇటు ప్రభుత్వం అటు ఎన్నికల కమిషన్‌లు చారిత్రాత్మకం అనిపించేలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుండడంతో ఉపాధ్యాయుల పరిస్థితి అయోమయంలో పడినట్లయ్యింది. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సాధారణంగా ఏడాదికి రెండుసార్లు సెలవులు వస్తాయి. దసరా సెలవులు 10-15 రోజులు కాగా విద్యాసంవత్సరం ముగింపువేళ వేసవికాలంలో 45రోజుల దాకా సెలవులు ఉంటాయి. ఇదే కాలంలోనే వారికి మౌల్యమాపన ప్రక్రియ కూడా ఉంటుంది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగానే ఫలితాలు ప్రకటించి విద్యార్థులు ఉత్తీర్ణత వివరాలను బహిరంగం చేయాల్సి ఉంటుంది. సాధారణంగా రాష్ట్రంలో విద్యాసంవత్సరం మే నెలాఖరున ప్రారంభమవుతుంది. నాలుగు నెలల పాఠ్యాంశాలతో అర్ధవార్షికం పూర్తి అవుతుంది. ఇందుకు సంబంధించి పరీక్షలు ముగించి 10-15 రోజులు దసరా సెలవులు ఇస్తారు. సంస్కృతి సంప్రదాయంలోనే పండుగ కావడంతో ప్రతిచోటా పదిరోజులు వేడుకలు జరుగుతాయి.



15రోజుల్లోనే కులగణన

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 22నుంచి కులగణన నిర్వహించాలని నిర్ణయించింది. అక్టోబరు 7లోగా ప్రక్రియ ముగించాలని తీర్మానించింది. 15రోజుల వ్యవధిలో రాష్ట్రంలోని ఏడు కోట్ల మంది ప్రజల కులం, విద్య, ఆర్థిక, సామాజిక పరిస్థితులను సర్వే రూపంలో సేకరించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించారు. విద్యుత్ కనెక్షన్‌ల ఆధారంగా ప్రతి ఇంటికీ ఓ స్టిక్కర్‌ను అతికించే ప్రక్రియను అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా అమలు చేశారు. ప్రతి వ్యక్తి వివరాలు 60 ప్రశ్నల రూపంలో సేకరించేలా నమూనాను రూపొందించారు. ఇన్ని ప్రశ్నలకు సమంజసంగా వివరాలు నమోదు చేసేందుకు ఉపాధ్యాయులతోనే సాధ్యమని ప్రభుత్వం భావించింది. అయితే ఇతరశాఖల ద్వారా ఉద్యోగులను సమకూర్చుకునే పరిస్థితి కూడా లేదు. 1.75 లక్షలమంది ఉపాధ్యాయులను కులగణనకు కేటాయించనున్నారు. వాస్తవానికి ప్రభుత్వం అన్ని శాఖలను కలిపితే దాదాపు 2లక్షలకుపైగా ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. ఉపాధ్యాయుల కొరత కూడా ఉన్నా మరో ప్రత్యామ్నాయం లేకుండా ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. 1.50 కోట్ల కుటుంబాల నుంచి ఏడు కోట్లమంది ప్రజల వివరాలు సేకరించాల్సి ఉంది.

22 నుంచి కులగణన

● తేదీల్లో మార్పు లేదు ● ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం తగదు: సీఎం



బెంగళూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక సమీక్ష (కులగణన) విషయంలో మంత్రులమధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. గురువారం జరిగిన కేబినెట్ భేటిలో డీసీఎం డీకే శివకుమార్, ఎంబీ పాటిల్‌తో పాటు పలువురు వాయిదావేయాలని పట్టుబట్టినట్టు తెలుస్తోంది. కులగణనను బీజేపీ రాజకీయం చేస్తోందని ఇది ప్రభుత్వానికి డ్యామేజ్ కానుందని డీసీఎం డీకే శివకుమార్ ప్రస్తావించినట్టు సమాచారం. అందుకు పలువురు మంత్రులు అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. కొత్తగా 331 కులాలను చేర్చిన ప్రస్తావనను కేబినెట్ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే సీఎం సిద్దరామయ్య మాత్రం అన్ని కులాల్లోనూ పేదలను గుర్తించి వారికి సంక్షేమాలను అందించడమే తన ఉద్దేశ్యమన్నారు. కానీ సామాజిక న్యాయం ఆలోచనతోనే కులగణన సర్వే జరపదలిచామన్నారు. కాగా శుక్రవారం సీఎం సమాచార శాఖ భవనంలో మీడియాతో మాట్లాడుతూ సర్వే అంతిమ నిర్ణయం బీసీ కమిషన్ తీసుకుంటుందన్నారు. అయితే ఈనెల 22వ తేదీ నుంచి సర్వే నిర్వహించడంలో ఎటువంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. పలు హిందూ కులాలకు క్రిస్టియన్ చేర్చడంపై అభ్యంతరాలు రావడంతో ప్రభుత్వం ఆ కాలమ్‌ను తొలగించాలని నిర్ణయించింది. దళిత క్రిస్టియన్, ఒక్కలిగ క్రిస్టియన్, బ్రాహ్మణ క్రిస్టియన్, లింగాయత క్రిస్టియన్ తోపాటు పలు కులాలకు చేర్చడాన్ని వాపసు తీసుకునేందుకు నిర్ణయించినట్టు తెలుస్తోంది. కులగణన విషయంలో గతంలోనూ మంత్రుల మధ్య విబేధాలు వచ్చిన విషయం తెలిసిందే. గతంలో లింగాయత, ఒక్కలిగ కులాలను తక్కువ చూపారని అభ్యంతరం తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నివేదికను అంగీకరించేది లేదని అభ్యంతరం తెలిపారు. అధిష్టానం వీటన్నింటినీ పరిగణించి సర్వే జరిగి దశాబ్దకాలమైందని వాయిదా వేసిన సంగతి విదితమే. కులగణను ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదన్నారు. అన్ని కులాలకు న్యాయం చేయడమే లక్ష్యం అన్నారు.

జోయాలుక్కాస్‌లో
మేకింగ్‌చార్జీ 50శాతం తగ్గింపు

బెంగళూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రముఖ జ్యువెలరీ సంస్థ జోయాలుక్కాస్ బిగ్గెస్ట్ జ్యువెలరీ సేల్ ఆఫ్ ది ఇయర్‌ను ప్రకటించింది. సంస్థ ఛైర్మన్ డాక్టర్ జోయ్‌అలుక్కాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోల్డ్‌కట్, అన్‌కట్ డైమండ్స్, ప్లాటినం, వెండి, ప్రెషెర్స్ స్టోన్ జ్యువెలరీ శ్రేణిలో మేకింగ్ చార్జీలు ఫ్లాట్ 50శాతం తగ్గింపును వినియోగదారులు పొందవచ్చునన్నారు. మిలియన్‌కు పైగా విలక్షణమైన డిజైన్లు కూర్పు చేసిన సమూహంతో క్లాజిక్ డిజైన్‌లనుంచి ఇటలీ, టర్కీలకు చెందిన సమకాలీన ఎత్నో, ఆధునిక, సంప్రదాయబద్ధమైన ఆభరణాలకు వర్తిస్తుందన్నారు. ప్రతి వినియోగదారుడికి నిజమైన, ఆనందకరమైన అభరణాల అనుభవాన్ని ఎల్లప్పుడూ అందించడమే జోయాలుక్కాస్ లక్ష్యమన్నారు. ఏడాదిలో అతిపెద్ద జ్యువెలరీ సేల్ ప్రత్యేకమైన ఆఫర్ ప్రయోజనాలు అందిస్తోందన్నారు. అన్ని జోయాలుక్కాస్ షోరూంలలో అక్టోబరు 5వరకు జ్యువెలరీ సేల్ అమలులో ఉంటుందన్నారు. ప్రతి కొనుగోలుపై వినియోగదారులకు ఉచితంగా జీవితకాల నిర్వహణ, ఏడాదిపాటు ఉచితబీమా, బైబ్యాక్ హామీని కూడా ఇస్తున్నామన్నారు.

Joyalukkas
World's favourite jeweller

సాంకేతికతకు ప్రభుత్వం పెద్దపీట

● విజ్ఞాన సమ్మేళనం ప్రారంభోత్సవంలో మంత్రి బోసరాజు



మాట్లాడుతున్న మంత్రి బోసరాజు

రాయచూరు సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు శాస్త్ర సాంకేతిక శాఖలు, చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసరాజు అన్నారు. శుక్రవారం నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో 6వవిజ్ఞాన సమ్మేళనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయ రంగానికి అనువయించడం ద్వారా రైతుల్లో పురోగతికి బాటలు వేయాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్, విజ్ఞాన శాస్త్ర అధ్యయనంపై కన్నడ మాధ్యమంలోనే సమ్మేళనం ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాల పై విస్తృతమైన అవగాహన లభిస్తుందన్నారు. తాము పొందిన విజ్ఞాన అధ్యయన సారాంశాన్ని రైతులకు వివరించడం ద్వారా వారికి సహకరించాలని విద్యార్థులకు సూచించారు. కాగా వ్యవసాయ రంగానికి సంబంధించి శాస్త్ర సాంకేతిక అంశాలను మరింతగా అందించే దిశగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మేళాకు జిల్లాలోని విద్యార్థులు రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


పాత్రికేయులు వాస్తవాలను రాయాలి

● ఆరోపణలను పరిశీలించాకే ప్రచురించాలి ● ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన బాధ్యత పత్రికలదే: ముఖ్యమంత్రి సిద్దరామయ్య



అవార్డు అందుకున్న పాత్రికేయులతో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాత్రికేయులు వాస్తవాలను అవగాహన పొంది కథనాలు ప్రకటించాలని, ఆరోపణలు వచ్చాయని కనీసమైన పరిశీలన లేకుండా ముందుకెళ్లరాదని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. సమాచారశాఖ కార్యాలయంలో శుక్రవారం వడర్సె రఘురామశెట్టి సామాజిక న్యాయ పత్రికోద్యమ పురస్కారాన్ని డీ ఉమాపతికి ప్రదానం చేశారు. 2017 నుంచి 2023 వరకు వార్షిక పర్యావరణ, అభివృద్ధి జర్నలిజం పురస్కారాలను ప్రదానం చేశారు. పర్యావరణ విభాగంలో 2017కు సంబంధించి విజయలక్ష్మి శిరుబూరు, బీఎంటీ రాజీవ్, వినోద్‌కుమార్ బీ నాయక్, మాలతేశ్ అంగూర, సుధీర్‌శెట్టి, మల్లికార్జున హొసపాళ్య, ఆర్ మంజునాథ్, అభివృద్ధి పత్రికోద్యమ పురస్కారాలలో 2017లో చిజా రాజీవ్, దేవయ్య గుత్తేదార్, గిరీశ్ లింగణ్ణ, యోగేశ్ ఎంఎన్, నౌషాద్ బిజాపుర, సతీశ్ డీటీ, ఎస్ గిరీశ్‌బాబులకు ప్రదానం చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ బలహీనవర్గాల అభివృద్ధి నిజమైన ప్రగతి అన్నారు. సామాజిక న్యాయం పట్ల మీడియా ప్రజలలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. సమాజంలో కుల వ్యవస్థ, అసమానత ఉందని, సామాజిక వ్యత్యాసం రూపుమాపాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల చానెల్‌లు వారు ఇలా అన్నారు, మీరేం చెబుతారంటూ ప్రశ్నించడమే జర్నలిజంగా భావిస్తున్నారని, ఇది సరికాదన్నారు. దసరా ఉత్సవాల విషయంలో హైకోర్టు, సుప్రీంకోర్టు దాకా వెళ్లారని చెబుతున్నారని, వాస్తవం కూడా జర్నలిస్టులు తెలుసుకోవాలన్నారు. అలా కాకుండా చెరోవైపుగా మాట్లాడడం వాస్తవికతను ఎలా నిర్ధారించాలన్నారు. సమాజంలో మహిళలకు సమాన హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాసంస్థలలో రాజ్యాంగపీఠిక ప్రతిరోజూ చదవాలనే ఏర్పాటు చేశామన్నారు. తద్వారా రాజ్యాంగ ఆశయాలు విద్యార్థి దశనుంచే తెలపాలనేది ఆశయమన్నారు. కార్యక్రమంలో మంత్రి భైరతి సురేశ్, నజీర్‌సాబ్, సలీం అహ్మద్, ఎమ్మెల్సీ శివకుమార్, మీడియా అకాడమీ ఛైర్మన్ ఆయేషాఖానం, సమాచారశాఖ కమిషనర్ హేమంత్ నింబాల్కర్, సీఎం మీడియా కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





బళ్లారి కౌల్‌బజార్‌లో నడిరోడ్డుపైనే పోట్లాడుతున్న ఎద్దులు

ఢీ ఢీ.. బసవన్న


● బళ్లారిలో బెంబేలెత్తిస్తున్న పశువులు ● రోడ్లపైనే మందలు మందలుగా సంచారం
● ఎద్దుల కుమ్ములాటతో భయం.. భయం 8
● పట్టించుకోని పాలికె అధికారులు

కెనరా ఉత్సవ్‌లో ఆకట్టుకుంటున్న కళాఖండాలు

బెంగళూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా రంగోలిమెట్రో సెంటర్‌లో ఏర్పాటు చేసిన కెనరా ఉత్సవ్‌ను బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ మహేశ్‌పై ప్రారంభించారు. రంగోలి మెట్రో సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన శిబిరం మూడు రోజులపాటు కొనసాగనుంది. స్వయం సహాయక సంఘాల మహిళలు, స్థానిక చేతివృత్తుల కళాకారులు రూపొందించిన బొమ్మలతోపాటు వస్తువులు, తినుబండారాలను ప్రత్యేక స్టాల్స్‌లో ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలనుంచి సాయంత్రం 8 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా మహేశ్‌పై మాట్లాడుతూ కెనరా ఉత్సవ్ ద్వారా మహిళలకు ఆర్థిక చేయూతతోపాటు వారు తయారుచేసిన వస్తువులకు విక్రయం, బ్రాండింగ్ కల్పించడం కెనరా ఉత్సవ్ ఆశయమన్నారు.



కళాఖండాలను తిలకిస్తున్న బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ మహేశ్‌పై



పుట్టపర్తిలో పొంగిపొర్లుతున్న చెక్ డ్యాం



పరగోడు డ్యాం నిండి పరవళ్లు తొక్కుతున్న చిత్రావతి

చిత్రావతి చిందులు..!

కర్ణాటకలో భారీ వర్షం
పరవళ్లు తొక్కుతున్న చిత్రావతి

- పొంగిపొర్లుతున్న పరగోడు డ్యాం
- పుట్టపర్తిలో చెక్ డ్యాంపై నుంచి నీరు
- తనకల్లు మండలంలో భారీ వర్షం
- ఉధృతంగా ప్రవహించిన వంకలు
- జాతీయ రహదారిపై నిలిచిన రాకపోకలు

చిలమత్తూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో చిత్రావతి నది పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి నదీ ప్రవాహం ఉధృతమైంది. దీంతో పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తమయ్యారు. కర్ణాటకలోని నంది కొండల్లో నుంచి వచ్చే చిత్రావతి చిలమత్తూరు, గోరంట్ల మండలాల మీదుగా పుట్టపర్తికి చేరుకుంటుంది. నదిపై కర్ణాటకలోని బాగేపల్లి సమీపంలోని పరగోడు వద్ద కట్టిన డ్యాం పూర్తిగా నిండిపోయి, పొంగిపొర్లుతోంది. ప్రవాహం గంటగంటకు పెరగడంతో పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. చిలమత్తూరు మండలంలో కొడికొండ, మధురేపల్లి, సుబ్బరావుపేట, బూదిలి గ్రామాల వద్ద ఉన్న వంతెనలపై ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొంతకాలంలగా వర్షాభావంతో నిరాశ చెందిన రైతులు నాలుగురోజులుగా పడుతున్న వానలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న మరోనది కుషావతి కూడా పారుతోంది. నదికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తమయ్యారు. ఈ నది ద్వారా చిలమత్తూరు, కోడూరు చెరువులకు పెద్దఎత్తున నీరు చేరుతోంది. చిత్రావతి, కుషావతి నదులు ఉధృతంగా పారుతున్న నేపథ్యంలో రాత్రి సమయాల్లో వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. రాత్రి సమయాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఏ సమయంలోనైనా నీటి మట్టాలు పెరగవచ్చని చెబుతున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

పొంగిపొర్లిన చెక్ డ్యాం

పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి): చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పుట్టపర్తిలోని చెక్‌డ్యాం పూర్తిగా నిండిపోయి, పొంగిపొర్లుతోంది. సత్యసాయి శత జయంతి వేడుకల వేల నదికి నీరు రావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పుణ్యస్నానాలకు ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు. భూగర్భ జలాలు పెరిగి, తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని స్థానికులు చెబుతున్నారు. చిత్రావతికి వరద పెరుగుతోందనీ, లోతట్టుప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కల్యాణచక్రవర్తి సూచించారు. గ్రామాల్లో దండోరా వేయించాలని సిబ్బందిని ఆదేశించారు.

భారీ వర్షం

తనకల్లు (ఆంధ్రజ్యోతి): మండలంలోనిమార్పురివాండ్లపల్లి, రాగినేపల్లి, కురమాలపల్లి, పెద్దఎద్దులవారిపల్లి, బొంతపల్లి, ఎర్రగుంటపల్లి, చీకటిమానుపల్లి, తదితర ప్రాంతాల్లో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. కుంటలు, చెరువులు, వంకలు, వాగులు, చెక్ డ్యామ్‌లు పూర్తిగా నిండి, పొంగిపొర్లాయి. పది రోజులుగా పెద్ద ఎద్దువారిపల్లి చెరువుకు హంద్రీనీవా నీటిని వదులుతుండగా.. వర్షపు నీరు తోడవడంతో పూర్తిగా నిండింది. పైనున్న చెరువులన్నీ నిండి పొంగి పొర్లడంతోపాటు వర్షం ఎక్కువగా కురవడంతో పెద్ద ఎద్దులవారిపల్లి చెరువు మరువ పారింది. కురమాలపల్లి వద్ద హంద్రీనీవా కాలువ నీటికి వర్షపునీరు తోడవడంతో ప్రవాహం పెరిగింది. దీంతో రోడ్లు కోతకు గురయ్యాయి. ఒక్కసారిగా నీరు అంతా రావడంతో చీకటిమానుపల్లి వద్ద శుక్రవారం ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు జాతీయ రహదారి నీటితో నిండిపోయింది. రాకపోకలు స్తంభించాయి. దీంతో ఈదులవంక నుంచి రెండు కిలోమీటర్లపైగా వాహనాలు ఆగిపోయాయి. వంకకు అటు వైపు అన్నమయ్య జిల్లాలోని మొలకల చెరువు వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదుల వంక ఉధృతి తగ్గగానే యువకులు దగ్గరుండి వాహనాలను దాటింపజేశారు. ఒక్కరాత్రిలోనే చెరువులన్నీ నిండిపోవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న ఈదులవంక



రోడ్డుకి ఇరువైపులా ఆగిన వాహనాలు



సుబ్బరావుపేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది

జీఎస్టీ ఎఫెక్ట్ !

- ముందుకు సాగని చెరువుల మరమ్మతులు
- జిల్లాకు రూ.రెండు కోట్లు మంజూరు
- 168 చెరువులకు 30చెరువుల్లో పనులు ప్రారంభం
- జీఎస్టీ నిబంధనతో ముందుకురాని సాగునీటి సంఘం సభ్యులు



వెంగళమ్మచెరువులో మరమ్మతు పనులు జరుగుతున్న దృశ్యం

మడకశిర, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చెరువుల మరమ్మతులపై జీఎస్టీ లైసెన్స్ ఎఫెక్టు తీవ్రంగా పడుతోంది. జీఎస్టీ లైసెన్స్ ఉన్న సాగునీటి సంఘం వారే మరమ్మతులు చేయాలని ప్రభుత్వ నిబంధనలతో ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా 168 చెరువులకు మరమ్మతు పనులు చేయాలని ప్రభుత్వం భావించగా కేవలం 30 చెరువుల్లోనే పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు 8 చెరువుల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జిల్లాలో చెరువుల మరమ్మతులపై దృష్టి సారించింది. ఈక్రమంలోనే జిల్లాకు తొలి విడతగా రూ. రెండు కోట్లు మంజూరు చేశారు. ఇందులో ఒక్కో చెరువుకు రూ.60 వేలు మొదలుకుని రూ.నాలుగు లక్షల దాకా నిధులు మంజూరు చేశారు. అయితే జీఎస్టీ నిబంధనతో పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడలేదు. పెనుకొండ డివిజన్ పరిధిలో 95 చెరువులకు గాను 25 చెరువులకు టెండర్లు పిలిచారు. 14 చోట్ల పనులు జరుగుతున్నాయి. ధర్మవరం డివిజన్‌లో 73 చెరువులకు రూ.99 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో 44 చెరువులకు టెండర్లు పిలిచారు. 17 చెరువులకు టెండర్లు పిలవాల్సి ఉంది. సాగునీటి సంఘం అధ్యక్షులు ఇప్పటికే 16 చెరువుల మరమ్మతు పనులు చేపట్టారు. ఇందులో 7 చెరువుల పనులు పూర్తి అయ్యాయి. ఆయకట్టు సంఘాలు లేని చోట టెండర్లు పిలిచి పనులు చేయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలైన తల్లికి వందనం, రేషన్‌కార్డు వంటి పథకాలు కోల్పోతామనే ఆందోళనతో చాలామంది ఆయకట్టు సంఘం సభ్యులు జీఎస్టీ లైసెన్స్ తీసుకోవడానికి ముందుకు రావడం లేదని సమచారం.

ఏడు చెరువులకు రూ.17లక్షలు



అమరాపురం మండలంలో ఏడు చెరువులకు రూ.17 లక్షలు మంజూరయ్యాయి. జీఎస్టీ లేకుండా పనులు చేపట్టేందుకు అనుమంతించాలని సంబ ంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లాం. చెరువు కట్టల మీద కంపచెట్లు తొలగించడం, తూముల మరమ్మతులు చేయడం ఈ వర్షాకాలంలో కష్టమని, డిసెంబరు లేదా జనవరిలో పనులు చేపట్టడానికి అనుమతించాలని అధికారులను కోరాం.

- గురుసిద్ధప్ప, చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు, అమరాపురం

జిల్లాకు రూ.రెండు కోట్లు: గురుమూర్తి, సురేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈలు

శ్రీసత్యసాయి జిల్లాలో చెరువుల అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. జిల్లా లో 168 పనులకు 30 చోట్ల పనులు జరుగుతున్నాయి. ఇందులో పెనుకొండ డివిజన్‌లో 95 చెరువులకు నిధులు మంజూరయ్యాయి. 14 చోట్ల పనులు పనులు ప్రారంభించారు. ఇందులో 25 చెరువులకు టెండర్లు పిలిచాం. ధర్మవరం డివిజన్‌లో 73 చెరువులకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో 17 చెరువులకు టెండర్లు పిలిచాం. 16 చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. ఏడు చోట్ల చెరువుల మరమ్మమతు పనులు పూర్తయ్యాయి.

చలో మెడికల్ కాలేజీకి స్పందన కరువు

- సెల్ఫీలతో సరిపెట్టిన వైసీపీ నాయకులు



పెనుకొండ మెడికల్ కళాశాల వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'చలో మెడికల్ కాలేజీ' పేరిట వైసీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమంలో 'సెల్ఫీ విత్ మెడికల్ కాలేజీ' అన్నట్లు తయారైంది. పిల్లర్ల నడుమ నిలబడి మెడికల్ కాలేజీ భవంతిని నిర్మించినట్లు నాయకకులు ఫొటోలు దిగారు. వైసీపీ అధినేత జగన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు కొందరు పెనుకొండ మెడికల్ కళాశాల భవనం నిర్మిస్తున్న ప్రాంతానికి వెళ్లారు. వైసీపీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పార్టీ రెండు జిల్లాల అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఉష శ్రీచరణ్, మాజీ ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి తదితరులు ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలపై కక్ష కట్టిందని ఆరోపించారు. పెనుకొండ వద్ద భవనాలు నిర్మించినా, ఏమీ లేవని మంత్రి సవిత చెప్పడం సిగ్గుచేటని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వైసీపీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. ఉష శ్రీచరణ్ ప్రసంగిస్తున్న సమయంలో ఓ కార్యకర్త 'నరుకుతాం' అంటూ కేకలు వేశాడు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్



అనంతపురంలో నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో 2.0 విధానంలో తలెత్తుతున్న సమస్యలపై డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం పెన్‌డౌన్ నిరసన నిర్వహించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న రిజిస్ట్రేషన్లు మాత్రమే పూర్తయ్యాయి. సబ్‌రిజిస్ట్రార్లు, ఇతర సిబ్బంది పెండింగ్ పనులు చేసుకున్నారు. స్టాంపులు, ఈసీలు, నకల్లు ఇతర వాటికి మాత్రమే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేశాయి. అనంతపురంలోని రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో -1, రూరల్ కార్యాలయంలో-4తో కలిపి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 15వరకు, శ్రీ సత్యసాయి జిల్లాలో 10 మొత్తం 21 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 25 డాక్యుమెంట్లు జరిగాయి. డాక్యుమెంట్ రైటర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ కొత్త విధానంలో రిజిస్ట్రేషన్ సమయంలో క్రయ, విక్రయదారులు ఓటీపీ చెప్పాల్సి వస్తోందని, కానీ మొబైల్‌ఫోన్లు లేని వారికి ఇబ్బందిగా ఉందన్నారు. ఎనీవేర్ విధానంలో గంటలో డాక్యుమెంట్ సబ్‌మిట్ చేసుకుంటే ఇదివరకు గంట సమయంలో ఓకే లేదా రిజెక్ట్ చేసే విధంగా ఉండేదన్నారు. కానీ ఇప్పుడు 48గంటలకు గడువు పెంచారని, దీంతో అక్కడి వారికి తీవ్ర సమస్యగా ఉందన్నారు. పెన్‌డౌన్ శనివారం కూడా కొనసాగిస్తామన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్
2.362 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం

వజ్రకరూరు(ఉరవకొండ), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని కమలపాడులో ఈ నెల 14న జరిగిన చోరీ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. నిందితులు ద్విచక్ర వాహనాల్లో స్టీలు, ప్లాస్టిక్ సామాన్లు అమ్మే వారిలా గ్రామంలో రెక్కీ నిర్వహించారు. తాళాలు వేసిన రెండు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వాటిలో చొరబడి వెండి వస్తువులు, డబ్బులు ఎత్తుకెళ్లారన్నారు. ఈ కేసులో నిందితుల ఊనుంచి 2362గ్రాముల వెండి ఆభరణాలు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులైన ప్రకాశం జిల్లా కనిగిరి మండలం భూతంవారి గ్రామానికి చెందిన అంజయ్య, కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం మద్దిమడుగుకు చెందిన హనుమంతు, ప్రకాశం జిల్లా కనిగిరి మండలం భూతంవారి గ్రామానికి చెందిన ఏసురత్నంను కొనకొండ్ల సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

వచ్చేసింది.. సెలవుల పండుగ

అనంతపురం విద్య, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులపై కొన్నిరోజులుగా సాగుతున్న చర్చకు తెరపడింది. స్కూల్ క్యాలెండర్ ప్రకారం నవరాత్రుల ప్రారంభం నుంచే పాఠశాలలకు సెలవులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఏడాది 22 నుంచి నవరాత్రులు ప్రారంభం కానుండగా.. రెండు రోజులు ఆలస్యంగా 24వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు సెలవులు ప్రకటించారు. దీనిని ఉపాధ్యాయ వర్గాలు తప్పుబట్టాయి. నవరాత్రుల ప్రారంభం రోజు నుంచి కాకుండా ఆలస్యంగా ఇవ్వడం ఏంటంటూ వ్యతిరేకిస్తూ వచ్చారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు సైతం సెలవులు నవరాత్రులు ప్రారంభంనుంచే ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాలు ఇస్తున్నారు. విద్యాశాఖ రాష్ట్ర అధికారులు దీనిని పెద్దగా పట్టించుకోలేదు. చివరకు టీడీపీ ఎమ్మెల్సీలు.. విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ దృష్టికి సెలవులు వ్యవహారం తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈనెల 22వ తేదీ నుంచే దసరా సెలవులు ఉంటాయని ప్రకటిస్తూ ట్వీట్ చేశారు. ఆ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా సెలవులు ఉంటాయని వెల్లడించారు. ఆదివారం ఎలాగూ సెలవు ఉంటుంది. సోమవారం నుంచి వచ్చేనెల 2వతేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారు. అక్టోబరు 3వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని విద్యాశాఖ అధికారవర్గాలు తెలిపాయి.

దానిమ్మ ధర నేలచూపులు

టన్ను రూ.60వేలలోపే..
ఈ రేటుతో పెట్టుబడులు కూడా రావంటున్న రైతులు
ఇతర రాష్ట్రాల్లో దిగుబడులు బాగా రావడమే కారణం



ఏపుగా కాసిన దానిమ్మకాయలు

పుట్లూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దానిమ్మ ధరలు నేలచూపులు చూస్తున్నాయి. నానాటికీ తగ్గుతున్నాయి. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నెలరోజుల క్రితం ఉన్న ధరలు అమాంతం తగ్గి సగానికి పడిపోతున్నాయి. దీంతో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కనీసం పెట్టుబడులైనా వస్తావా.. రావా.. అన్న ఆందోళనలో ఉన్నారు. గతేడాదితో పోలిస్తే దానిమ్మ ధరలు సగం పైగానే తగ్గిపోయాయి. పుట్లూరు, పెద్దపప్పూరు, యల్లనూరు, యాడికి, తాడిపత్రి, నార్పల తదితర మండలాల్లో దానిమ్మ ఎక్కువగా సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 13,381 ఎకరాల్లో పంట పెట్టారు. గతంలో ధరలు ఎక్కువగా ఉండడంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ఈ ఏడాది ధరలు తగ్గుముఖం పట్టడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

టన్ను 60వేలలోపే..

ఎకరాలో దానిమ్మ సాగుకు రూ.80 వేల నుంచి లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్లు చెబుతున్నారు. దిగుబడి కూడా బాగానే వచ్చింది. టన్ను ధర ప్రస్తుతం 60వేలలోపే పలుకుతోంది. మూడు నెలల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. సరిగ్గా ఏడాది క్రితం దానిమ్మ టన్ను ధర రూ.1.20 లక్షలు పలికి రైతులకు సిరులు కురిపించింది. ఈసారి కూడా ధరలు బాగుంటాయనుకున్న రైతులకు నిరాశే ఎదురైంది. ఇతర రాష్ట్రాల్లో పంట దిగుబడి ఎక్కువగా ఉండడంతో ఏపీలో ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు చెబుతున్నారు. నవంబరు నుంచైనా ధరలు పెరుగకపోతాయా అన్న ఆశతో రైతులు ఉన్నారు. అప్పుడు కూడా ధరలు పెరగకపోతే నష్టాలు తప్పవని వాపోతున్నారు. పంటను మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, చెన్నై తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో పంట ఎక్కువగా వస్తుండడంతో తెలంగాణ, చెన్నైకి నామమాత్రంగా ఎగుమతి చేస్తున్నారు.



వాహనంలో తరలించడానికి సిద్ధం చేస్తున్న దృశ్యం


పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు



దానిమ్మ ధరలు ఇలాగే కొనసాగితే పెట్టుబడులు కూడా రావు. ఎకరాకి పెట్టుబడి రూ.80వేల నుంచి లక్ష వరకు వచ్చింది. దిగుబడి బాగున్నా.. ధరలు తగ్గడం కలవరపెడుతోంది. నాలుగెకరాల్లో దానిమ్మ సాగుచేశా. రానున్న నెలల్లో అయినా ధరలు పెరిగితే కొంత ఉపశమనం దక్కుతుంది.

- వెంకటనారాయణ, వరదాయపల్లి

ఈ ధరలతో నష్టమే..



దానిమ్మ ధరలు తగ్గడంతో పంటను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నాం. కొన్నిచోట్ల పంట కోత దశకు రావడంతో నష్టానికే విక్రయించాల్సి వస్తోంది. ఏడెకరాల్లో పంట సాగుచేశా. పంటలో సస్యరక్షణ చర్యలు తప్పకుండా చేపట్టాల్సి ఉంటుంది. లేకపోతే దానిమ్మ కాయలు దెబ్బతిని మొదటికే మోసం వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు తక్కువ ధరకే అడుగుతున్నారు.

- శివశంకర్ రెడ్డి, కందికాపుల

వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు



చంద్రాయుడు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో వాతావరణ పరిస్థితుల కారణంగా పలు పంటల్లో సస్యరక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు శుక్రవారం ప్రకటనలో సూచించారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వరుస వర్షాలతో భూమిలో తేమ ఎక్కువై, పలు రకాల పంటలను తెగుళ్లు ఆశించాయన్నారు. వెంటనే సస్యరక్షణ చేపట్టాలనీ, ఆలస్యంచేస్తే దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఆయన తెలిపిన సూచనలు.

పంటలు, తెగుళ్లు, నివారణ వివరాలు..

- 90 రోజుల వయసున్న వేరుశనగ పంటలో ఆకుమాడు, వేరుకుళ్లు, బూడిద రోగం 20 నుంచి 40 శాతందాకా ఉంది. వీటి నివారణ కోసం ఎకరాకు 250 గ్రాముల సాఫ్‌ను వేర్ల వద్ద తడిసేలా పిచికారీ చేసుకోవాలి.
- ఆముదం పంట పూత, గెల ప్రారంభ దశలో ఉంది. వేరుకుళ్లు, నామాల పురుగు, కాయకుళ్లు 15 నుంచి 30 శాతం వరకు ఆశించాయి. ఎకరాకు 250 గ్రాముల సాఫ్, 80 గ్రాముల ప్రొక్లేమ్‌ను పిచికారీ చేసుకోవాలి.
- కంది పంట శాకీయ, పూత దశలో ఉంది. ఎండు తెగులు, వెర్రి తెగులు, లద్దె పురుగులు ఆశించాయి. నివారణ కోసం 250 గ్రాముల సాఫ్, 80 మి.లీ. కొరాజన్‌ను పిచికారీ చేసుకోవాలి.
- మొక్కజొన్నను కత్తెర పురుగు, ఆకుమాడు తెగులు ఆశించాయి. వీటి నివారణ కోసం ఎకరాకు 80 మి.లీ కొరాజన్, 250 గ్రాముల సాఫ్‌ను పిచికారీ చేసుకోవాలి.
- చిరుధాన్య పంటల్లో లద్దె పురుగు, తెగుళ్ల నివారణ కోసం ఎకరాకు 80 గ్రాముల ప్రొక్లేమ్, 250 గ్రాముల సాఫ్‌ను స్ప్రే చేసుకోవాలి.
- కంది, ఆముదం, మొక్కజొన్న, చిరుధాన్యాల పంటలపై ఎకరాకు మల్టీ కే 10కిలోలను పైపాటుగా పిచికారీ చేసుకోవాలి.

23న మడకశిరలో మెగా జాబ్‌మేళా

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, నాయకులు

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మడకశిరలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23వ తేదీన మేగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన మెగా జాబ్‌మేళా పోస్టర్లను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 11 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయన్నారు. యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, తేజ్ కుమార్ రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

డాక్టర్ అయ్యగారి సాంబశివరావు (జయంతి)




ఏఎస్ రావుగా చిరపరిచితులైన దేశంలోనే ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పేరొందిన 'పద్మభూషణ్' గ్రహీత అయ్యగారి సాంబశివ రావు 1914 సెప్టెంబరు 20న పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో జన్మించారు. ఇంజనీర్, శాస్త్రవేత్తగా రాణించారు. హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇండియా లిమిటెడ్ (ఇసీఐఎల్) సంస్థాపకులలో ఒకరు. అణుశక్తి విభాగంలో హోమీ బాబా, విక్రమ్ సారాభాయ్ వంటివారితో కలసి పనిచేశారు. అణురియాక్టర్ అప్సరకు కంట్రోల్, మానిటరింగ్ పరికరాలు సమకూర్చారు. ముంబైలోని టీఐఎఫ్ఆర్‌లో కాస్మిక్ కిరణాల పరిశోధనలో విజయం సాధించారు. పద్మశ్రీ, శాంతిస్వరూప్ భట్నాగర్, గౌరవ డాక్టరేట్‌లు ఇతరత్రా గౌరవాలు పొందారు. 2003 అక్టోబరు 31న కన్నుమూశారు.

అక్కినేని నాగేశ్వరరావు (జయంతి)



ఏఎన్నార్‌గా చిరపరిచితులైన అక్కినేని నాగేశ్వరరావు 1923 సెప్టెంబరు 20న కృష్ణా జిల్లా నందివాడ మండలం రామాపురంలో జన్మించారు. ఎన్టీఆర్‌తో కలసి తెలుగు సినీ పరిశ్రమకు మూల స్తంభంగా నిలిచారు. 1975లో భార్య పేరిట అన్నపూర్ణ స్టూడియో ఏర్పాటు చేశారు. నటుడు, నిర్మాత, రచయితగా రాణించారు. నాటకాల ద్వారా వెండితెరపైకి వచ్చారు. ఏడు దశాబ్దాలలో పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో సుమారు 255 సినిమాల్లో నటించి 'నట సామ్రాట్'గా పేరొందారు. పద్మశ్రీ, దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డు, ఫిల్మ్‌ఫేర్, నంది అవార్డులు ఇతర పురస్కారాలు అందుకున్నారు. 'పద్మవిభూషణ్' అందుకున్న తొలి తెలుగు నటుడు. 2014 జనవరి 22న కన్నుమూశారు.

ధర్మవరపు సుబ్రమణ్యం (జయంతి)



ప్రముఖ హాస్యనటుడు ధర్మవరపు సుబ్రమణ్యం 1960 సెప్టెంబరు 20న ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెంలో జన్మించారు. అత్యధిక రెమ్యూనరేషన్ పొందిన హాస్యనటులలో ఒకరిగా నిలిచారు. ఏపీ కల్చరల్ అసోసియేషన్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. రెండు నంది అవార్డులు అందుకున్నారు. అంతకుముందు ప్రజానాట్యమండలి తరఫున ఎన్నో నాటకాలు, ప్రదర్శనలు ఇచ్చారు. నటించి, దర్శకత్వం వహించిన దూరదర్శన్‌లో ప్రసారమైన 'ఆనందోబ్రహ్మ' సీరియల్ ఎంతో పేరొందింది. 2013 డిసెంబరు 7న కన్నుమూశారు.

జీన్ సిబెలియస్ (వర్ధంతి)



ఫిన్లాండ్ దేశానికి చెందిన గొప్ప వయోలిన్ వాద్యకళాకారుడు జీన్ సిబిలియస్ 1865 డిసెంబరు 8న జన్మించారు. సంగీతం ద్వారా ఫిన్లాండ్ దేశంలో జాతీయ గుర్తింపు పొందారు. సెవెన్త్ సింఫనీ, ఇతర సంగీత కార్యక్రమాలు అంతర్జాతీయ పేరొందాయి. 1957 సెప్టెంబరు 20న కన్నుమూశారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు సాగాయి. కాగా ఆయన జయంతిని 'డే ఆఫ్ ఫినిష్ మ్యూజిక్'గా ఆచరిస్తున్నారు.

సౌందర్య రజనీకాంత్ (పుట్టినరోజు)



ఇండియన్ గ్రాఫిక్ డిజైనర్‌లలో ఒకరిగా పేరొందిన సౌందర్య రజనీకాంత్ 1984 సెప్టెంబరు 20న మద్రాస్‌లో జన్మించారు. అసలు పేరు షాకుబై రావ్ గైక్వాడ్. తమిళ సినీరంగంలో నిర్మాతగా, దర్శకురాలిగా రాణి స్తున్నారు. తమిళ సూపర్‌స్టార్, తండ్రి రజనీకాంత్ ప్రోత్సాహంతో ఇండియాలో తొలి మోషన్ కాప్చర్ సినిమా 'కొచాడియాన్'కు దర్శకత్వం వహించారు. ఈసినిమా 'టెక్నికల్ ఇన్నోవేషన్ ఇన్ ఫిల్మ్'గా గుర్తింపు పొందింది. 2002 నుంచి సినీరంగంలో కొనసాగుతున్నారు. సొంతంగా ప్రొడక్షన్ సంస్థను ఏర్పాటు చేశారు.

చదువుతోపాటు సమాజాన్ని తెలుసుకోండి

» కేంబ్రిడ్జ్ విద్యార్థులకు డాక్టర్ విజయలక్ష్మి దేశ్‌మానె పిలుపు



విజయలక్ష్మి దేశ్‌మానె, దయాసింధును సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

బెంగళూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు సమాజాన్ని తెలుసుకోవాలని కిద్వాయ్ మాజీ డైరెక్టర్, పద్మశ్రీ గ్రహీత డాక్టర్ విజయలక్ష్మి దేశ్‌మానె అభిప్రాయపడ్డారు. కేంబ్రిడ్జ్ ఇంజనీరింగ్ కళాశాల అకడమిక్ ప్రారంభం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి దేశ్‌మానె మాట్లాడుతూ విద్యార్థులు నిజజీవనంలో తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. చదువుకునేవేళ అమూల్యమైన సమయాన్ని వృథా చేయరాదన్నారు. ఇతరుల తప్పులను ఎత్తిచూపడంతో సాధించేది ఉండదన్నారు. సమాజానికి మంచి చేయాలనే ఆలోచన, చదువులో నైపుణ్యత సాధించాలన్నారు. ప్రపంచానికి సూపర్‌పవర్ కానున్న మీరు అందుకు అనుగుణంగానే రాణించాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రీసెర్చ్ అండ్ డిజిటల్ సంస్థ కోఫౌండర్ డాక్టర్ ఎస్ దయాసింధు మాట్లాడుతూ కేంబ్రిడ్జ్ ఉత్తమ విద్యా సంస్థలలో ఒకటిగా రాణిస్తోందన్నారు. ఇక్కడి సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఐ టెక్నాలజీకి విశ్వవ్యాప్తంగా డిమాండ్ ఉందని విద్యార్థులు సమగ్రమైన నైపుణ్యత సాధించాలన్నారు. హాకథాన్ సమ్మేళనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంబ్రిడ్జ్ గ్రూప్ సంస్థల ఛైర్మన్ డీకే మోహన్ మాట్లాడుతూ సంస్థ అంతర్జాతీయ స్థాయి గుణాత్మక, సౌలభ్యాలను కలిగి ఉందన్నారు. దేశానికి ఉత్తమ పౌరులను అందించే లక్ష్యంగా పెట్టుకున్నా మన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్నో విద్యాసంస్థలు ఉన్నా కేంబ్రిడ్జ్ తన సాధనలతో దేశంలోని అన్ని ప్రాంతాలనుంచి ఆకర్షిస్తోందన్నారు. విద్యార్థులకు ఆధునాతన సాంకేతిక తెలియచేస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రవిశంకర్, అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ కేఎన్ బాలసుబ్రమణ్య మూర్తి, డైరెక్టర్ డాక్టర్ జీ ఇందుమతి, డీన్ శాంతితోపాటు పలువురు పాల్గొన్నారు.

12న అఖిల భారతీయ సాహిత్య పరిషద్ సభ



మీడియాతో మాట్లాడుతున్న సాహిత్యపరిషద్ ముఖ్యులు

బెంగళూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అఖిలభారత్ సాహిత్య పరిషద్ 2025 వార్షిక సభ అక్టోబరు 12న బెంగళూరులో నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదరి రఘునందనభట్ అభిప్రాయపడ్డారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో పరిషద్ కోశాధికారి రామకృష్ణచౌకి, వైద్యవిభాగం ముఖ్యులు డాక్టర్ సీపే కిశోర్‌లు మీడియాతో మాట్లాడుతూ ఏడాదికి తాలూకా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా

» ఇరువురు సాధకులకు ఆదికవి, వాగ్దేవి పురస్కారాలు

సాహిత్య పరిషద్‌కు సంబంధించి 300లకు పైగా సమావేశాలు జరుగుతాయన్నారు. ఆదికవి పురస్కారాన్ని ప్రొఫెసర్ ఎల్‌వి శాంతాకుమారికు ఇవ్వదలచామన్నారు. కన్నడ సాహిత్య రంగంలో ఆమె ఎనలేని సేవలు చేశారన్నారు బోధనలతో పాటు పలు రచనలు చేశారన్నారు. ఆంగ్లసాహిత్యంలో స్నాతకోత్తర పట్టా సాధించారన్నారు. తుమకూరు కళాశాల అధ్యాపకురాలిగా సేవలందిస్తూనే ఎన్నోరచనలు చేశారన్నారు. కువెంపు భాషాభారతి, కర్ణాటక రచయితల సంఘం, కన్నడసాహిత్య పరిషత్ ద్వారా పలు పురస్కారాలను పొందారన్నారు. శివమొగ్గ జిల్లా తీర్థహళ్ళిలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్నఅరబగట్టె అణ్ణప్ప మూలం దావణగెరె జిల్లావాసి అన్నారు. సాహిత్యసేవ కోసం ఎన్నో పుస్తకాలను ప్రచురించారని పలుపత్రికలలో ఆయన కథలు ప్రచురితమైనట్లు తెలిపారు. అణ్ణప్పకు వాగ్దేవి పురస్కారం అందిస్తామన్నారు. ఇద్దరికి పురస్కారాలతో పాటు లక్ష రూపాయల నగదుతో పాటు షీల్డు అందించి సత్కారం చేస్తామన్నారు. అఖిలభారత్ సాహిత్య పరిషద్ దశాబ్దకాలంగా ఎన్నోసేవలు అందిస్తోందన్నారు. మహిళా, వైద్య, బాల విభాగాలు ప్రత్యేకంగా పరిషద్‌కు అనుబంధంగా పని చేస్తున్నాయన్నారు. కొవిడ్ వేళ రామనగర్‌లో నెలరోజులపాటు పేదలకు అన్నదానం చేశామన్నారు. వార్షిక పురస్కారాలకు జేకే గ్రూప్ పారిశ్రామిక వేత్త ఎస్ జయరాం, వాగ్దేవి విద్యాసంస్థల ముఖ్యులు, ఇస్రో మాజీ శాస్త్రవేత్త హరీష్ చెరో లక్షరూపాయలు విరాళంగా ఇస్తున్నారన్నారు.

అలరిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక ప్రదర్శనలో ఓ సన్నివేశం

చిక్కబళ్ళాపుర, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ప్రపంచం విభజనవైపు సాగుతున్న తరుణంలో కళలు, సంస్కృతి, మానవత్వం, సేవాస్ఫూర్తి పెంచేలా వన్ వరల్డ్-వన్ ఫ్యామిటీ వరల్డ్ కల్చరల్ ఫెస్టివల్‌లో ప్రపంచ నాయకులు, కళాకారులు, ఆధ్యాత్మికవేత్తలు ఒకే వేదికపై చేరుతున్నారు. ముద్దేనహళ్ళిలో ఆగస్టు 16న ప్రారంభమైన ఫెస్టివల్ నవంబరు 23వరకు కొనసాగనుంది. అఖిల ప్రపంచ సాంస్కృతిక వేదికకు చిహ్నంగా నిలుస్తోంది. శుక్రవారం కార్యక్రమంలో లెబనాన్, జపాన్, సౌదీ అరేబియా, నార్త్ మెసిడోనియా తదితర దేశాలనుంచి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు. 'ప్రేమ అనేది షరతు లేకుండా ఇవ్వాలి, సేవ అనేది ప్రతిఫలం లేకుండా చేయాలనే' వారి సందేశం సభికులను ఆకట్టుకుంది. యేఏఈ రాయల్ ఫ్యామిలీకి చెందిన షేక్ హమ్మైద్ బిన్ అబ్దుల్లా అల్‌ముఅల్లా, జోర్డాన్ రాయబారి యూసుఫ్ ముస్తఫా అలీ అబ్దెల్ ఘని, బురుండి రాయబారులు అలోయిస్ బిజిందావీ (ఇండియా), అలెక్సిస్ బుకురు (దక్షిణాఫ్రికా) వంటి ప్రముఖులు హాజరయ్యారు. ఆ వేదిక ప్రపంచశాంతి, ఐక్యతకు విలువైన వేదికగా అభివర్ణించారు. లెబనాన్ బృందం 'లవ్ ఈజ్ మై ఐడెంటిటీ', దక్షిణాఫ్రికా బృందం 13 వాయిసెస్, బురుండి రాయల్ డ్రమర్స్, ట్రినిడాడ్ అండ్ టొబాగో నుంచి సోకా రిథమ్స్, జింబాబ్వే సంప్రదాయ నృత్యాలు, జర్మనీ, గ్రీస్ స్వరాలు, జపాన్ స్పిరిట్ ఆఫ్ ప్రేయర్ తదితర కళాకారుల బృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఉచిత విద్య, వైద్యం, ఆహారంతోపాటు సేవాస్ఫూర్తిగా పలు సంస్థలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. సామాజిక ఐక్యతకు కృషి చేసిన దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు కగలేమా మోత్లాంతేకు వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ హ్యూమానిటేరియన్ అవార్డును ప్రదానం చేశారు. మధుసూధన సాయి మాట్లాడుతూ ఈనెల 22నుంచి నవరాత్రి, అతిరుద్ర మహాయజ్ఞాలు కూడా ఉంటాయన్నారు.

బసవాపట్టణలో ముగిసిన ఆరోగ్య శిబిరం



పంచాయతీ సభ్యుడు ఆనంద్‌కుమార్‌కు సన్మానం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బసవాపట్టణలో కొనసాగిన ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతం కావడానికి గ్రామస్తులకు మళమాచనహళ్ళి గ్రామపంచాయతీ సభ్యుడు ఆనంద్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. బసవాపట్టణలో వారం రోజులుగా కేంద్రప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఆరోగ్య శిబిరం కొనసాగుతోంది. శిబిరం ముగింపు సభలో పాల్గొని మాట్లాడుతూ వైద్యసిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. డీటీఓ డాక్టర్ ఉమా మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజమే లక్ష్యమన్నారు. ప్రత్యేకించి క్షయ రోగంతో ఎవరూ మృతి చెందరాదని ప్రత్యేక కార్యాచరణ కొనసాగుతోం దన్నారు. బాధితులు తగిన చికిత్సలు పొందితే త్వరగా కోలుకోవచ్చునన్నారు. మేలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి రమేశ్, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు జయలక్ష్మి, మునిరాజు గ్రామపంచాయతీ సభ్యురాలు ఉమాదేవి, ప్రభాకర్, నాగరాజ్, జయమ్మ, మునిరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన విదేశీ బృందం



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విదేశీయులతో స్థానిక బృందం

బాగేపల్లి, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ సరిహద్దులోని ప్రభుత్వ ఆసుపత్రులలో పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలపై అధ్యయనం చేసేందుకు దక్షిణాఫ్రికాకుసహా వివిధ దేశాల 15మంది సభ్యుల బృందం పట్టణంలోని తాలూకా ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం సందర్శించింది. ప్రయోగాలయం, ఉత్తమ ఫార్మసీ విభాగంలను పరిశీలిం చారు. ఆసుపత్రి కార్యవైఖరిపై ప్రశంసలు లభించాయని తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ సీఎన్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆసుపత్రి పాలనాధికారి డాక్టర్ వినయ్ ఉన్నారు.

ఆటో డ్రైవర్ల పోస్ట్‌కార్డు ఉద్యమం

రాయచూరు సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రదేశాల్లో బైకులు, ట్యాక్సీలకు అనుమతిని రద్దు చేయాలని జిల్లాకు చెందిన ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని గంజ్ సర్కిల్ వద్ద సీఐటీయూ నేతృత్వంలో ఆటోడ్రైవర్లు పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు జిలాని పాష, ప్రముఖ పర్యాటక కేంద్రాల వద్దకు వెళ్లె బైక్‌లకు ట్యాక్సీలకు అక్కడ స్థానికంగా సంచరించే అనుమతి ఇవ్వడం వల్ల ఆటోల పై ఆధార పడి జీవించే వారి పరిపస్థితి దుర్భరంగా మారనుందన్నారు. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూకు చెందిన డీఎస్ శరణ బసవ, గోపాల మార్కండ, హనుమంతు, నల్లారెడ్డి,దేవణ్ణ, నబి సాబ్, సలీం, వెంకటేశ్, కే హనుమంత తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

హిందూపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వచ్చేనెల 7న జరిగే కార్యక్రమానికి సంబంధించి వాల్మీకి కల్యాణమండపంలో ఆ సంఘం నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, గౌరవాధ్యక్షుడు ఆదినారాయణ, కార్యదర్శి నరసింహమూర్తి మాట్లాడుతూ వాల్మీకి జయంతికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో వాల్మీకులు తరలిరావాలన్నారు. వాల్మీకి మహిళలు జ్యోతుల ఉత్సవం ఉంటుందన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి వాల్మీకి సర్కిల్ వరకు ఊరేగింపు ఉంటుందన్నారు. సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉన్నత చదువులు

చదివే వారికి మంత్రి అండ

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్థోమతలేక ఉన్నత చదువులు చదివే నిరుపేద విద్యార్థులకు ఎల్లవేళలా మంత్రి సవిత అండగా ఉంటారని యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిరుపేద వైద్య విద్యార్థి సంతోష్ నాయక్‌కు ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. తల్లి లలితాబాయి, తండ్రి రవీంద్ర నాయక్ విద్యార్థికి ఆర్థిక సాయం అందించారు. వారు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి మంచిస్థాయిలో నిలబడి చేసిన సహాయాన్ని మరువకుండా వైద్యవృత్తిలో రాణించాలని ఆకాంక్షించారు. సూర్యనారాయణ, బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల కమిటీ ఎన్నిక

రొళ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయం జేఏసీ పిలుపుమేరకు శుక్రవారం జీఎస్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు కలిసి కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా రవి, ఉపాధ్యక్షుడిగా శశికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాలాజీనాయక్, కార్యదర్శి ఆంజనేయులుఎన్నుకున్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

రొళ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో శనివారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హాజరవుతున్నట్లు వైద్యాధికారి డా.సృజన తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను శాస్త్రీయతతో చేపట్టాలి: సంఘం నాయకులు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

రాయచూరు సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందిస్తున్న ఎస్సీ వర్గీకరణను శాస్త్రీయ పద్ధతితో రూపొందించాలని భోవి, బంజార, కొరచ, కొరమ జాతుల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాలోని సింధనూరు నగరంలో ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, న్యాయమూర్తి నాగమోహన్ దాస్ కమీషన్ సిఫార్సులను తిరస్కరించాలని డిమాండ్ చేశారు. తమ అత్యంత సామాజిక వెనుకబాటుతనానికి గురైన తమ జాతులను అస్పృశ్యులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే కొత్తగా రూపొందించిన వర్గీకరణను రద్దు చేసి అన్ని వర్గాలతోమ సంప్రదించి శాస్త్రీయ పద్ధతిలో రూపొందించాలని కోరారు. ఈ మేరకు సింధనూరు తహసీల్దార్ ద్వార ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చారు.

ముళ్ల పొదల మధ్య నీటి ట్యాంకు

సోమందేపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తికుంటపల్లి గ్రామానికి తాగునీటిని అందించే నీటి ట్యాంకు చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొళాయిల ద్వారా తమకు అందే నీరు సురక్షితమేనా అని ప్రశ్నిస్తున్నారు. నీటి ట్యాంక్‌లో విషపురుగులు, చెట్ల వ్యర్థాలు పడి కలుషితం అవుతున్నట్లు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛతాహిసేవ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు గ్రామాల్లో అమలు కావడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఏమేరకు చర్యలు చేపడుతున్నారో వారిపనితీరుకు ఇది అద్దం పడుతోంది. పారిశుధ్య పనులు ప్రతి రెండో శనివారం ఏర్పాటు ఫొటోలకు ఫోజులివ్వడంతప్ప అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించిన దాఖలాలు లేవు. అసలే వర్షాకాలం ఆపై సీజనల్ వ్యాధులు విజృంభించి గ్రామాల్లో ప్రజలు జ్వరాలబారినపడి ఆస్పత్రుల్లో చేరి చికిత్సలు పొందుతున్నారు. ట్యాంకులో ఉన్న నీరు కలుషితమై సరఫరా అయితే ఏంటి పరిస్థితని స్థానికులు ప్రశిస్తున్నారు.



గుబురు చెట్ల మధ్య ఉన్న నీటి ట్యాంక్

దీపికా విద్యార్థి వేతనకు శ్రీకారం



అజీం ప్రేమ్‌జీతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అజీంప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో చదివిన 37వేలమంది విద్యార్థినులకు ఏడాదికి రూ.30వేలు చొప్పున దీపికా విద్యార్థివేతనకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమలో సీఎం సిద్దరామయ్య, విప్రో ఐటీ కంపెనీ ఛైర్మన్ అజీం ప్రేమ్‌జీ, డీసీఎం డీకే శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు. 10నుంచి 12దాకా ప్రభు త్వ విద్యా సంస్థలలో చదివి డిగ్రీలో చేరినవారు అర్హులని అజీం ప్రేమ్‌జీ ప్రకటించారు. బాలికా విద్యను ప్రోత్సహించాలనే దీపికా విద్యార్థి వేతనం(స్కాలర్‌షిప్)ను అమలు చేస్తున్నామన్నారు. అజీం ప్రేమ్‌జీ సామాజిక సేవలను సీఎం సిద్దరామయ్య అభినందించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్థానిక ప్రముఖులు

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని అరికెరెలో పలు కార్యక్రమాలు సాగాయి. విశ్వకర్మసంఘం తాలూకా అధ్యక్షుడు లోకేశ్ నేతృత్వం వహించారు. శిల్పాలు, విగ్రహాలు, ఆభరణాల తయారీలో విశ్వకర్మలు తమదైన నైపుణ్యం కలిగారన్నారు. ఇదే వృత్తిగా కొనసాగుతున్నారన్నారు. రాష్ట్రంలో విశ్వకర్మ సామాజికవర్గం 15లక్షల మందికిపైనే ఉన్నారన్నారు. విశ్వకర్మ సమాజం ఉన్నతికోసం సబ్సిడీ రుణాలు అందచేసి ప్రభుత్వం ఇతోధికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఉమాపతిగౌడ, లోకేశ్‌రెడ్డి, మధు, ఉమాశ్రీనివాసరెడ్డి, బొమ్మనహళ్ళి అధ్యక్షుడు జీటీఆర్ మధు, బొమ్మనహళ్ళి బ్లాక్ లేబర్‌సెల్ అధ్యక్షుడు ఓబులేశు, మిథున్‌గౌడ, హైకోర్టు న్యాయవాది చిన్నయ్య పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత చిన్నారులకు చేయూత



ఇస్కాన్ ఆలయం వద్ద చిన్నారులు

బెంగళూరు, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): బాలల క్యాన్సర్‌పై చైతన్యం కలిగించేందుకు ఇస్కాన్ ఆలయాన్ని ప్రత్యేక వెలుగులు నింపారు. గురువారం రాత్రి ప్రత్యేక లైటింగ్స్ ఏర్పాటు చేశారు. బాధిత చిన్నారులను ఆలయ దర్శనంకోసం తీసుకొచ్చారు. క్యాన్సర్ బారిన పడిన పిల్లలతోపాటు వారి తల్లిదండ్రుల పోషణ, చిన్నారులకు విద్య సమకూరుస్తున్న యాక్సిస్ లైఫ్ అసిస్టెంట్స్ ఫౌండేషన్ సంస్థ కార్యక్రమాన్ని నిర్వహించింది. క్యాన్సర్ బారిన ఎడిన పిల్లల కోసం బెంగళూరు సిబ్బంది, వలంటీర్లు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. యాక్సిస్ లైఫ్ బెంగళూరు కేంద్రం డైరెక్టర్ దివ్యశ్రీ మాట్లాడుతూ క్యాన్సర్ బాధిత చిన్నారుల రక్షణకోసం ప్రత్యేక చేయూత కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. చిన్నారులలో ఉన్న ఆలోచనలో మార్పులు తీసుకురావాలని, ఇస్కాన్ మందిరానికి తీసుకొచ్చామన్నారు. సంస్థ చిన్నారులకు ధైర్యం కలిగించేలా సహకరించిందన్నారు.

వైద్యరంగంలో సాంకేతికతకు స్ట్రైకర్ కొత్తకేంద్రం

బెంగళూరు, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యసేవలు మరింత సులభతరం చేసేందుకు స్ట్రైకర్ సంస్థ బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో కొత్తకేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. దేశంలో పరిశోధనలు, ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వదలిచినట్టు స్ట్రైకర్ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్ ఉపాధ్యక్షులు రామ్‌రంగరాజన్ ప్రకటించారు. ప్రస్తుతం గుర్‌గావ్‌లో ఓ కేంద్రం ఉందని తదుపరి బెంగళూరు కేంద్రం ద్వారా రోబోటిక్స్, ఏఐ, డిజిటల్ సాంకేతిక విధానాలు, స్ట్రెచర్స్, అంబులెన్స్‌కార్ట్‌లపై మరింత పరిశోధనలు చేయదలిచామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11.351	10,687
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11,146	10,147
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

భారీ వర్షాలతో వరి పంటకు దోమల బెడద

సిరుగుప్ప, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో వరి పంటకు దోమల బెడద వలన రోగాలు సోకినట్లు జిల్లా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ తెలిపారు. సిరుగుప్ప తాలుకాలోని బూదిగుంప, కరూరు, గోస్‌బాల్, వివిధ గ్రామాలలో వరి పంటలను పరిశీలించారు. వరి పంటకు భారీ వర్షంతో వరి పంటకు వివిధ రోగాలు సోకినట్లు ఆయన తెలిపారు. పంట నష్టం వాటిల్లకుండా వ్యవసాయ నిపుణుల సలహాలు తీసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆయన తెలిపారు. రైతులు వ్యవసాయ పరిశోధన కేంద్రానికి సందర్శించి వరి పంటకు సోకిన రోగాల నివారణకు నిపుణుల సలహాలు, మందులు పిచికారీ చేయాలని తెలిపారు. రైతులు శాస్త్రవేత్తల సలహాలు పొందాలన్నారు.

ఏసీసీ అదానీ సంస్థ ఆధ్వర్యంలో తాగునీటి బోర్లు

కంప్లి, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో నీటి సమస్య వుండే వార్డుల్లో ఏసీసీ అదానీ ఆధ్వర్యంలో నూతన వాటర్ బోర్లను వేయించారు. గతంలో నీటి సమస్యపై ఏసీసీ అదానీ అధికారులతో చర్చించి సీఎస్ఆర్ నిధుల కింద తమ పట్టణంలో బోర్లు వేయించాలని కోరారు. దీనిపై స్పందించిన సంస్థ ప్రతినిధులు బోర్లు వేయించడానికి పూనుకున్నారు. ఇప్పటికే కుడితిని పట్టణంలో ఏడు బోర్లను వేయించామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. గ్రామాల్లో నీటిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో ఎక్కడైనా రాణించవచ్చు

● ప్రజాపిత ఈశ్వరీయ సోదరి ఆదిలక్ష్మి

పావగడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మనిషిగా తన లోపాలను సరిదిద్దుకుని ప్రపంచంలో ఎక్కడైనా రాణించగలరని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సోదరి ఆదిలక్ష్మి అన్నారు. పావగడ నుంచి అయోధ్య రామ మందిరంతోపాటు ప్రముఖ ధార్మిక కేంద్రాలైన సోమనాథ, ద్వారక, వారణాసి, అయోధ్య రామమందిరం వరకు పర్యటించామన్నారు. అలాగే ప్రముఖ ధార్మిక కేంద్రమైన మౌంట్ ఆఫ్ రాజస్థాన్ దర్శించుకుని పునీతులైనట్లు ఆమె తెలిపారు. ప్రజాపిత బ్రహ్మ గురువులు కూడా దర్శించుకుని ఆధ్యాత్మికంగా ఎంతో ధన్యమైనట్లు సేవాకర్త రాజశేఖర్ తెలిపారు.

జీఎస్టీ 2.0తో పన్ను వ్యవస్థ సులభతరం

● తగ్గనున్న నిత్యావసర వస్తువుల ధరలు ● కొన్నింటికి పూర్తిగా రద్దు: బీడీసీసీఐ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేసిందని బీడీసీసీఐ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలో జీఎస్టీ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ సంస్థ యొక్క లక్ష్యాలు, విజయాల గురించి వివరించారు. వ్యాపారులు, పారిశ్రామిక సంస్థలకు వివరించడానికే అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జీఎస్టీ 1.0 యొక్క ప్రధాన లక్ష్యం ఒకదేశం, ఒక పన్ను జీఎస్టీ 2.0 పన్ను వ్యవస్థను మరింత సరళీకృతం చేయడానికి రూపొందించిందన్నారు. జీఎస్టీ 2.0 ఆటోమొబైల్స్, సిమెంట్, రియల్ ఎస్టేట్, భీమా వ్యవసాయం వంటి రంగాలపై ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఇది సామాన్యులకు సహాయపడుతుందని, ద్రవ్యోల్బణాన్ని మరింత తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. సీఏ రాజేశ్ కుమార్ మాట్లాడుతూ టీఆర్ 12శాతం , 29శాతం పన్ను శ్లాబులను తొలగించడమే జీఎస్టీ 2.0 ప్రధాన లక్ష్యం అన్నారు. జీఎస్టీ 2.0 లగ్జరీ కొనుగోళ్లకు 40 శాతం అధిక శ్లాబును ప్రతిపాదిస్తుందని తద్వారా 5శాతం, 18శాతం శ్లాబులకు మార్పు ఆదాయాన్ని ప్రభావితం చేయబడుతుందన్నారు. షాంపూ, సబ్బులు, టూత్‌పేస్ట్, వెన్న,నెయ్యి, చీజ్, బ్రెడ్ వంటి రోజువారీ నిత్యావసర వస్తువులపై 5శాతం పన్ను తగ్గించబడుతుం దన్నారు. వివిధ ఆహార, పాల ఉత్పత్తులను పన్ను నుంచి మినహాయించారన్నారు. ఆరోగ్య సంరక్షణ, భీమా, స్టేషనరీ వంటి విద్య సంబంధిత వస్తువులపై కూడా ఎటువంటి పన్ను ఉండదన్నారు. ముఖ్య అతిథిహాజరైన సీఏ ముసనల్లి రాఘవేంద్ర రెడ్డి, జీఎస్టీ 2.0రేటు మార్పులు ,పరివర్తన సమస్యల గురించి వివరించారు. ఈసందర్భంగా సంస్థ సీనియర్ ఉపాధ్యక్షుడు అవ్వారు మంజునాథ్, ఉపాధ్యక్షులు సొంతగిరిధర, సంయుక్త కార్యదర్శులు మర్చేడ్ మల్లికార్జున గౌడ, రామచంద్ర, సీఏ రాజశేఖర్, గౌరవ కార్యదర్శి సురేశ్‌బాబు ఇతర సంస్థ ఆఫీస్ బేరర్లు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించడం లేదు

● జిల్లా ఉన్నతాధికారుల్లోనూ నిండా నిర్లక్ష్యం
● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆగ్రహం



మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి చౌదరి

రాయచూరు సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కీలక అధికారుల తీరు ఏ మాత్రం ఆశాజనకంగా లేదని, కర్నాటక మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగలక్ష్మి చౌధరి అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా జిల్లాధికారి, జిల్లా ఎస్పీ, జడ్పీ సీఈఓలు ఏ ఒక్క సమస్యకు సకాలంలో సానుకూలంగా స్పందించడం లేదంటూ నేరుగా ఆరోపించారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చిన వాటి పరిష్కారానికి సంబంధించి అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలోని రంగమందిరంలో జరిగిన మహిళా స్పందన సభలో పాల్గొన్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగలక్ష్మి చౌధరి, సత్వరమే పరిష్కరించాల్సి సమస్యలను సహితం జిల్లా అధికారులు నెలల తరబడి నాంచుతుండడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వీరి పై తాను రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని వీరి పై చట్టపరమైన చర్యల కోసం ప్రభుత్వం దృష్టికి తెస్తానన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగలక్ష్మి చౌధరి జిల్లాలో ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

అగళి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) శ్రీసత్యసాయి జిల్లా అగళి మండలం ఇనగలూరు గ్రామానికి చెందిన రైతు నరసింహమూర్తి శుక్రవారం తన పొలంలో పనిచేస్తుండగా పాము కాటువేసింది. స్థానికులు గమనించి హుటాహుటిన రొళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కులగణన విజయవంతం చేయాలి

● బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

సిరుగుప్ప, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన విజయవంతానికి అందరూ సహకరించాలని బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున కోరారు. శుక్ర వారం సిరుగుప్ప పట్టణం శివజ్యోతి పబ్లిక్ పాఠశాలలో బీసీ సంక్షేమ శాఖ తాలుకా పరిపాలన ఆధ్వర్యంలో బీసీ కులగణన సర్వే కార్యక్రమం నేపథ్యంలో సర్వే చేసే ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గౌసియా బేగమ్, తాలుకా పంచాయతీ ఈఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో మొక్కలకు నీరుపోయడం ద్వారా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ కే మల్లికార్జున మాట్లాడుతూ తాలుకాలో బీసీ కులస్తులు 75 వేల కుటుంబాలు వున్నట్లు ఆయన తెలిపారు. సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 7 వరకు ఈ సర్వే కార్యక్రమం జరుగుతున్నట్లు తెలిపారు. తాలుకా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించాలనే ప్రభుత్వ కులగణనకు పూనుకుందని, ఎవ్వరూ కూడా ఇందులో నమోదు చేసుకోకుండా ఉండరాదన్నారు. సర్వేకు వచ్చే ఉపాధ్యాయులకు పూర్తిగా సహకరించాలన్నారు. సరైన సమాచారం అందజేసి ప్రభుత్వ పథకాలను పొందాలన్నారు. కార్యక్రమంలో శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్, తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ మద్దేరు సిద్దయ్య, విశ్వజ్యోతి పబ్లిక్ పాఠశాల అధ్యక్షులు బసలింగప్ప, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విరుపాక్షేశ్వర దేవస్థానం ముందు ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్ల ఆందోళన

● బైక్ ట్యాక్సీలను అనుమతించరాదని డిమాండ్

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బైక్ ట్యాక్సీలకు అనుమతి ఇవ్వరాదంటూ ఆటోరిక్షా యజమానులు గురువారం హంపి విరూపాక్షేశ్వరుడి ఆలయం ముందు ఆందోళన చేపట్టారు. బైక్‌ట్యాక్సీల కారణంగా ఆటో రిక్షాలకు గిరాకీ లేకుండా పోతోందని, కర్నాటక ఆటోరిక్షా డ్రైవర్ల యూనియన్(ఎఫ్‌కేఏఆర్‌డీయూ) రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఎం.సంతోష్ కుమార్ అన్నారు. పర్యాటక ప్రాంతాల్లో బైక్ ట్యాక్సీలకు అనుమతి ఇవ్వడం ద్వారా ఆటోయజమానులు తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఈ సందర్భంగా లక్ష పోస్టుకార్డులను ముఖ్యమంత్రికి పంపారు. రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ అసలే ఓలా, ఉబెర్, ర్యాపిడ్, నమ్మ యాత్రి లాంటిప్రైవేట్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. మోటారు వాహన చట్టం సవరించడంలో రాష్ట్ర ప్రభుత్వం కర్నాటక మోటార్ వాహన చట్టం సవరించి ప్రైవేట్ కంపెనీలకు అగ్రిగేటర్ అనుమతి ఇవ్వడాన్ని ఆరోపించారు. ఈ కారణంగా ఆటోలకు డిమాండ్ తగ్గిపోతున్న తరుణంలో అదనంగా బైక్ ట్యాక్సీలకు అనుమతి ఇవ్వడం సరికాదని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.అనంతశయన, హంపి విభాగం అధ్యక్షులు రాఘవేంద్ర, కార్యదర్శి విరూపాక్షి, సిఐటియు ట్యాక్సీ సంచాలకులు, సంఘం ప్రముఖులు చెన్నబసవనగౌడ ఆందోళనలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బెస్ట్ కాలేజీ విద్యార్థులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): బెస్ట్ పీయూ కళాశాల విద్యార్థుల బృందం జిల్లా ప్రీ-యూనివర్సిటీ విద్యాశాఖ ఆధ్వర్యంలో బళ్లారిలోని ఎస్.జీ. ప్రీ-యూరివర్సిటీ వీవీ సంఘంలో జరిగిన జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మొదటి స్థానాన్ని గెలుచుకుంది. హాసన్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఎంపికైంది. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను సంస్థ అధ్యక్షుడు కోనంకి రామప్ప, కార్యదర్శి తిలక్‌కుమార్, ప్రిన్సిపాల్ మన్నెం శ్రీనివాసులు, ఉప ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఉప ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి సిబ్బంది అభినందించారు.

బీమా పరిహారం అందజేత



బాధిత కుటుంబానికి పరిహారం అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ట్రెక్కింగ్‌లో దుర్మరణం చెందిన విద్యార్థి కుటుంబానికి పరిహారం అందజేశారు. మనోజ్ కుమార్ అనే విద్యార్థి ట్రెక్కింగ్ ట్రిప్‌లో ఉండగా అకాల మరణం చెందడంతో వారి కుటుంబానికి కెనరా హెచ్‌ఎస్‌బీసీ, బళ్లారి జిల్లాపంచాయతీ శాఖ రూ.10,58,500 బీమా పరిహార చెక్కును శుక్రవారం అందజేశారు. మనోజ్ కుమార్ అనే విద్యార్థి విద్యారుణాన్ని ఈ బ్యాంకు ద్వారా తీసుకున్నారు. కెనరా హెచ్‌ఎస్‌బీసీ కవర్డ్ ఇన్సూరెన్స్ పాలసీ కింద రూ. 1.35,021 వన్-టైమ్ ప్రీమియం చెల్లించి బీమా చేయించుకున్నారు. వారి విద్యారుణానికి భీమా ఉండటంతో ఆ కుటుంబం ఆర్థిక సహాయం పొందగలిగింది. భీమ పరిహారాన్ని కెనరా బ్యాంక్ మేనేజర్ అరుణ్‌కుమార్, ఏజీ కెనరా బ్యాంక్ ఆర్ఎహెచ్ బళ్లారి అధిపతి కిషోర్ కుమార్ సమక్షంలో కుటుంబానికి పరిహారం అందజేశారు. విషాదకరమైన పరిస్థితుల్లో కుంటుంబానికి ఆర్థికభద్రత కల్పించడం బీమా కంపెనీ సామాజిక బాధ్యత అని కెనరా బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ అరుణ్ కుమార్ అన్నారు.

రోడ్డు పక్కనే వారపు సంత



రోడ్డు పక్కనే వారపుసంతతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

కంప్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని మెట్రి గ్రామంలో శుక్రవారం జరిగే కాయగూరలు వారం సంత మార్కెట్ వాహనదారులకు ఇబ్బందిగా మారింది. రోడ్డుపక్కనే కాయగూరల వ్యాపారం చేపట్టడంతో రోడ్డుపై వెళ్లే వాహనాల ద్వారా ఎటు నుంచి ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ప్రజలను దృష్టిలో వుంచుకుని సంతకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

దేవలాపురం సహకార సంఘం కార్యదర్శిగా లింగన్నగౌడ

కంప్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని దేవలాపురం ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం కార్యదర్శిగా జీ లింగన్నగౌడ నియామకమయ్యారు. గతంలో కొమరప్పఇన్‌చార్జ్ కార్యదర్శిగా విధులు నిర్వహించే వారు వారి అవధి ముగింపు కావడంతో సహకార సంఘం సభ్యులు జీ లింగన్నగౌడ్‌కి ఆ బాధ్యతలు అప్పగించారు. లింగన్నగౌడ మాట్లాడుతూ తమకు ఇచ్చిన బాధ్యతల్ని గౌరవంగా స్వీకరించుకుని తమపై వుంచిన నమ్మకాన్ని విధుల్లో సేవలు అందించి తమ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సహకార సంఘం సభ్యులు గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



లింగన్నగౌడను సత్కరిస్తున్న అధ్యక్ష, ఉపాధ్యక్షులు

హోసూరు జోన్



వేదికపై మాజీ ఎంపీ నరసింహన్ తదితరులు

మెట్రో, విమానాశ్రయానికి కేంద్రం ఆమోదం

● ఇండియన్ మాన్యుఫాక్చరర్స్ ఎగ్జిబిషన్‌లో మాజీ ఎంపీ నరసింహన్

హోసూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హోసూరు-బెంగళూరు మెట్రో రైలుప్రాజెక్టుకు, హోసూరు విమానాశ్రయ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం ఆమోదం తెలిపిందని మాజీ ఎంపీ నరసింహన్ తెలిపారు. శుక్రవారం ఇండియన్ మాన్యుఫాక్చరర్స్ ఎగ్జిబిషన్ హోసూరు హిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య, ఎగ్జిబిషన్ కమిటీ చైర్మన్ రామలింగం, పీఎంసీ కళాశాల అధ్యక్షుడు కుమార్, ఎగ్జిబిషన్ కో-చైర్మన్ సుందరయ్య, హోసూరు సబ్ కలెక్టర్ ఆకృతిశెట్టి తదితరులు పాల్గొన్నారు. తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వం సంయుక్తంగా మెట్రో ప్రాజెక్టు చేపట్టాల్సి ఉంటుందన్నారు. 2వేల ఎకరాలలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. తనేజా ఏరోస్పేస్ విమానాశ్రయం ఇప్పటికే 400 ఎకరాలలో పనిచేస్తోందని, ఇక్కడ ఎయిర్‌స్ట్రిప్ ఉందని, ఇక్కడ విమానసేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

నేడు వేపనపల్లిలో వైద్యశిబిరం

హోసూరు (కృష్ణగిరి), సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా వేపనపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 20న శనివారం స్టాలిన్ వైద్య శిబిరం జరగనుంది. ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 5వరకు కొనసాగుతుందని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. 17మంది వైద్యనిపుణులు పరీక్షలు చేస్తారన్నారు. రక్తపరీక్షలు, ఎక్స్‌రే, ఈసీజీ, ఎకో, అల్ట్రాసౌండ్, కంటి పరీక్షలతోపాటు గర్భిణీలకు కూడా పరీక్షలు చేస్తారన్నారు. శిబిరంలో అర్హులైనవారికి ముఖ్యమంత్రి బీమాపథకం కార్డును పంపిణీ చేస్తారన్నారు. దివ్యాంగులకు గుర్తింపుకార్డులు కూడా మంజూరు ఉంటుందన్నారు.

విలేజ్ అసిస్టెంట్ రాత పరీక్షలు వాయిదా

హోసూరు రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి, పోచంపల్లి, అంచెట్టి తాలూకాలలో ఖాళీగా ఉన్న విలేజ్ అసిస్టెంట్ పోస్టులకు ఈనెల 21న జరగాల్సిన రాత పరీక్షను వాయిదా వేసినట్లు తహసీల్దార్ రహిబ్‌జాన్ తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ జూలై 12న నోటిఫికేషన్ జారీ అయ్యిందన్నారు. పోచంపల్లి ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, కృష్ణగిరి ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో రాత పరీక్షలు నిర్వహించేలా అర్హులైన అభ్యర్థులకు హాల్‌టిక్కెట్‌లు పంపబడ్డాయన్నారు. పాలనా కారణాల వల్ల రాత పరీక్ష తాత్కాలికంగా వాయిదా పడిందన్నారు. త్వరలోనే పరీక్షల తేదీని ప్రకటిస్తామన్నారు.



మీడియాతో తహసీల్దార్ రహిబ్‌జాన్

ఢీ..ఢీ.. బసవన్న



రోడ్లపై పేరుకుపోయిన చెత్త పక్కనే ఎద్దుల సంచారం

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నరగవాసులను పశువులు బెంబేలెత్తిస్తున్నాయి. నడిరోడ్డుపైనే మందలు, మందలుగా తిరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. నగరపరిధిలో ప్రధాన కూడళ్ళు, రోడ్డు ప్రక్కన చెత్తచెదారం పడేయడంతో చెత్తను మేయడానికి వచ్చిన పశువులు అక్కడే సేదదీరుతుండడంతో రోడ్డుపైన వెళ్ళే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది చాలదన్నట్లు... పశువులు రోడ్లపైనే కుమ్ములాట పాల్పడుతుండడంతో రోడ్డుపై వెళ్ళే ప్రజలు, వాహనదారులు పరుగులు దీయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా కౌల్‌బజార్ ప్రాంతంలో ఎక్కువగా మురికి వాడల ప్రాంతాలే ఎక్కువగా ఉండడంతో రోడ్డు ప్రక్కన ఎక్కడ చూసినా చెత్తాచెదారాల కుప్పలే కనిపిస్తున్నాయి. దీని తోడు వీధి పశువులు కూడా ఏకంగా రోడ్లపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నోమార్లు స్థానిక ప్రజలు, పలు సంఘ సంస్థలు కార్పొరేషన్ అధికారులకు దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదు. పశువుల యజమానులకు రోడ్లపైకి పశువులను వదలరాదని నోటీసులు జారీ చేయాలని కోరినా పట్టించుకోవడం లేదు. దీంతో నగరంలోని ప్రధాన కూడళ్ళలో పశువులు సేదతీరుతున్న కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో కార్పొరేషన్ అధికారులు స్పందించి వీధి పశువులు రోడ్లపైకి వదలకుండా పశువుల యజమానులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సంఘాల అభివృద్ధికి సహకరించాలి

● కృషిపత్తిన సహకార సంఘం అధ్యక్షుడు తాళూరు వెంకటరమణ



మాట్లాడుతున్న అధ్యక్షుడు తాళూరు వెంకటరమణ

కంప్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ భాగాల్లో వుండే ప్రాథమిక కృషిపత్తిన సహకార సంఘాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని శ్రీరామ రంగాపురం కృషిపత్తిన సహకార సంఘం అధ్యక్షుడు తాళూరు వెంకటరమణ అన్నారు. శుక్రవారం శ్రీరామరంగాపురంలోని ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం మహాజనసభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2024-25 సంవత్సరం నాటి లెక్కలను కార్యదర్శి రమేష్ చదివి వినిపించారు. ఈ సహకార సంఘంలో 3,377 మంది సభ్యులు ఉన్నారన్నారు. కేసీసీ రైతు రుణాల కింద 514 మందికిగాను రూ. 5,49,08,000 రుణాలు ఇచ్చామన్నారు. పాడి పరిశ్రమ కింద 69 మందికిగాను రూ.21.78 లక్షలు రుణాలు కల్పించారు. రసాయన ఎరువులు వ్యాపారం సిమెంటు వ్యాపారం సహకార సంఘం ద్వారా చేపట్టమని తెలిపారు. యేడాదికి రూ.1.79 లక్షలు సహకార సంఘం లాభాల బాటలో కొనసాగుతుందన్నారు. అనంతరం అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఏ నిబంధనలో మంజూరైన సామాన్య సభలో ఆ విషయాలు సభ్యులకు తెలియజేయాలన్నారు. ఖాతాదారులే తమ సహకార సంఘానికి దేవుళ్లతో సమానమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు యల్లప్ప, సభ్యులు మోదుపల్లి జయచంద్ర, బోయపాటి చిన్న హనుమంతు, చంద్రకళ, దబ్బర వెంకటరమణ, తాలురంగడి శ్రీనివాసులు, రాజా సాబ్, మోదుపల్లి గోపాల్ గోవిందు, నారాయణస్వామి, విజయలక్ష్మీ, మోదిపల్లి మారుతీప్రసాద్, గ్రామ ప్రముఖులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.